రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం


వట్టిఖమ్మంపహాడ్ నుంచి పాశ్యానాయక్ తండాకు వెళ్లే రహదారి


మున్యానాయక్‌తండా నుంచి చివ్వెంలకు వెళ్లే రహదారి

- గుంతలమయంగా చివ్వెంల మండలంలోని పలు గ్రామాల రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చివ్వెంల : చిన్నపాటి వర్షాలకే గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకంగా రోడ్లను నిర్మించడంతో కొన్ని నేలలకే గుంతలమయంగా తయారవుతున్నాయి. మూడేళ్ల నుంచి వర్షాకాలంలో ఇదే పరిస్థితి దాపురిస్తోందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పాశ్యానాయక్‌తండా, మున్యానాయక్‌తండా, పాండ్యానాయక్ తండా, జయరాంగుడి తండా, పిల్లలజెగ్గు తండా గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సరిగాలేకపోవడంతో వృద్ధులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రోడ్లు సరిగాలేకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి.

హామీలకే పరిమితం..

ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించినప్పుడు రోడ్లకు మరమ్మతు పనులు చేపడుతామని హామీ ఇస్తున్నారు. కానీ అవి అమలు కావడం లేదని పలువురు తెలుపుతున్నారు. కొన్నేళ్ల నుంచి పాలకుల హామీలు నీటి మీద రాతలాగే మిగిలిపోతున్నాయని వాపోతున్నారు. రోడ్ల విషయాన్ని ఎన్నిసార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పనులు చేయిస్తామని అంటున్నారే తప్పా ఆచరణలో కన్పించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నలిచి, గుంతలు కనిపించక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి

గ్రామం నుంచి చివ్వెంల మండల కేంద్రానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా రోడ్లను నిర్మించాలి.

– ధరావత్ క్రిష్ణ, పాశ్యానాయక్‌తండా

ప్రతిపాదనలు పంపించాం

గుంతలమయమైన రోడ్లను పరిశీలించాం. నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నిధులు మంజూరు కాగానే నూతన రోడ్లు వేస్తాం.

– బి.లింగానాయక్, పీఆర్ ఏఈ, చివ్వెంల

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుంగతుర్తి : అన్నారం 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్నారం, సంగెం, కర్విరాల, కొత్తగూడెం గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నారం 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్

ఆత్మకూరు (ఎస్) : యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యువజన సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, ఆర్గనైజర్స్ సైదులు, మంజుల, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్'

తుంగతుర్తి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఎన్నో తప్పుడు మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, వానాకాలం సీజన్ పూర్తి కావొస్తున్నా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తుంగతుర్తిలోనే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్, ఉప్పుల నాగమల్లు, వెంకన్న, మట్టిపెల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

అర్వపల్లి : ప్రాచీన కళలు అంతరించిపోకుండా వాటిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి కోరారు. జాజిరెడ్డిగూడెంలోని గౌడ్స్‌కాలనీకి చెందిన భాగవతం కళాకారులకు సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల్లో వివిధ ప్రదర్శనలకు మంగళవారం రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుడిపల్లి సోమిరెడ్డి, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, తాటిపాముల జలంధర్, కళాకారులు నిమ్మల యాదయ్య, కుంభం వెంకన్న, నర్సింగ యాదయ్య, నిమ్మల సత్తయ్య, భిక్షం, మల్లయ్య, కోటమర్తి శ్రీకాంత్, నర్సింగ పెద

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా భాస్కర్


భాస్కర్

తుంగతుర్తి, సూర్యాపేట టౌన్ : పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తుంగతుర్తి జెడ్పీ హెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న గుజ్జ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శిగా సూర్యాపేటకు చెందిన లక్కపాక ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆ సంఘం 35వ కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు.

బెల్లం పానకం ధ్వంసం

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని మంగళితండా, పీపానాయక్ తండాలలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి 50 లీటర్ల బెల్లం పానకం, 10 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఈ తండాల్లో ఇటీవల నల్ల బెల్లం, పటిక పెద్ద మొత్తంలో పట్టు పడడంతో అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. దీంతో మళ్లీ బెల్లం పానకం, నాటుసారా పట్టుబడగా.. నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ అధికారులు బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సూర్యాపేట ఎస్ఐ సురేందర్ బెనర్జీ, తుంగతుర్తి ఎస్ఐ జయప్రకాష్, డీటీఎఫ్ ఎస్ఐ రామకష్ణ, స్థానిక ఎస్ఐ సైదులు గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్ల బహూకరణ

తుంగతుర్తి : బండరామారం గ్రామ పంచాయతీకి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రేగటి రవి, రేగటి వెంకటేష్‌లు మంగళవారం 40 వీధి లైట్లను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దాతల సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప్పునూతల జయచందర్ రెడ్డి, ఎల్లయ్య, శివ, యాదగిరి, ముత్తిలింగం, సైదులు, నర్సయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులపై అవగాహన


మిరప తోటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

నూతనకల్ : మిరప తోటల రైతులు చీడ పీడల నివారణ కోసం సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని కేవీకే శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిలపకుంట్ల, యడవెల్లి గ్రామాల్లో మిరప తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిరప తోటల్లో ప్రధానంగా తామర, నల్లి, తెల్లదోమ ఆశిస్తాయని అన్నారు. వాటి నివారణ కోసం పసుపు, నీలం రంగులతో కూడిన జిగురు అట్టాలను ఎకరానికి 50 నుంచి 100 అమర్చుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు వేప నూనె 10000 పీపీఎం మూడు మిల్లీ లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని, సోలార్ దీపం ఎరను అమర్చాలని సూచించారు. పంటల పరిరక్షణ కోసం వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ప్రణీత, రైతులు భయ్యా దేవయ్య, గాజుల రమేష్, భయ్యా లింగమల్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా


కాసర్లపహాడ్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ ఈర్ల సైదులు కోరారు. మంగళవారం కాసర్లపహాడ్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే మాదకద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర అంశాలపై కళాప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఎం.శంకర్, గడ్డం ఉదయ్, పి.శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి.ఉపేందర్, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ


భానుపురి : బతుకమ్మ ఆడుతున్న ఇరిగేషన్ అధికారులు


చివ్వెంల : బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న న్యాయమూర్తులు

చివ్వెంల : సూర్యాపేటలోని జిల్లా కోర్టులో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి న్యాయమూర్తులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్ రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

భానుపురి : నేటి యువత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా కొనసాగించాలని నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి కార్యాలయ ఆవరణలో ఆడిపాడారు. మినీ ట్యాంక్ బండ్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శివ ధర్మతేజ, డీఈలు రమేష్, శ్రీనివాస్ రావు, హరికృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, నగేష్, ఏఈలు భూక్యా పాండు నాయక్, స్వప్న, మమత, మల్సూర్, రవికిరణ్, లింగయ్య, ఉదయ్ కిరణ్, యూడీసీ ఫణి, జూనియర్ అసిస్టెంట్ సతీష్, మహిళా ఉద్యోగులు సుస్మిత, హారిక, సుహాసిని పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ఆస్పత్రి ఆవరణలో ఆడిపాడారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడారు. బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదయాలకు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్ శ్రవణ్‌కుమార్, సీహెచ్ఓ బిచ్చునాయక్, సీహెచ్ఎస్ అరుణకుమారి, వైద్యసిబ్బంది గుంటకండ్ల ప్రవీన్‌రెడ్డి, విమలమ్మ, రామచంద్రు, వినోద, సుజాత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న వైద్యసిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే


తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తెలంగాణ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని తుంగతుర్తి నియోజకవర్గ శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అన్ని నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ పాఠశాలల వల్ల విద్యార్థులకు 5వ తరగతి నుంచి పీజీ వరకు ఉచితంగా విద్య అందుతుందని తెలిపారు. అత్యంత వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గానికి మొదటి విడతలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, సుంకరి జనార్దన్, నెమురుగొమ్ముల శాతవాహనరావు, జమ్మిలాల్, లక్ష్మయ్య, ప్రియలతారాము గౌడ్, రామాంజనేయులు, రామారావు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళం

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితుల సహాయార్థం తుంగతుర్తి నియోజకవర్గంలోని ఏడు సింగిల్ విండోల చైర్మన్లు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.70 వేల చెక్కును ఎమ్మెల్యే సామేల్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మోత్కూరు, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, తిరుమలగిరి, శాలిగౌరారం, అడ్డగూడూరు సింగిల్‌విండోల చైర్మన్లు పేలపూడి వెంకటేశ్వర్లు, నాగం జయసుధ, కుంట్ల సురేందర్‌రెడ్డి, పాలెపు చంద్రశేఖర్, తాళ్లూరి మురళి, కొప్పుల నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భారీ స్వాగతం

తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే సామేల్‌కు కాంగ్రెస్ నాయకులు భారీ స్వాగతం పలికారు. బైక్ ర్యాలీతో వచ్చి స్థానిక తెలంగాణ చౌరస్తాలో గజమాలతో సత్కరించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాస గృహంలో వివిధ మండలాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పేరాల వీరేష్, జమ్మిలాల్, సుంకరి జనార్దన్, కందుకూరి అంబేద్కర్, ప్రియలతారాము గౌడ్, సుధాకర్, లక్ష్మయ్య, వంశీ, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఘనపురం భిక్షం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, నాయకులు బండగొర్ల జనార్దన్, తోట జయమ్మ, బోయిని లింగమల్లు, వేముల రాంమూర్తి, ఈదుల రమేష్‌చంద్ర, దర్శనం లింగయ్య, మధార్, ఘనపురం రమేష్, ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెన్‌పహాడ్ : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని కాంగ్రెస్ మండల నాయకుడు దొంగరి గోపికృష్ణ అన్నారు. మంగళవారం న్యూబంజారాహిల్స్ తండాలో న్యూస్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సైదులు, హస్సేన్, ప్రేమ్, వెంకటేష్, రమేష్, శివరామ్, శ్రీహాన్, సంతోష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెంలో కబడ్డీ పోటీలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడోత్సవాలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. వివిధ గ్రామాల జట్ల మధ్య కబడ్డీ పోటీలు ఉత్సాహ భరితంగా జరిగాయి. కార్యక్రమంలో పీడీలు మల్లేష్, సోమయ్య, సైదులు, పూర్వ విద్యార్థులు ఎల్లంల కొమిరెల్లి, బింగి కృష్ణమూర్తి, సుతారపు అనిల్, అక్కులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థినులతో ఎస్ఓలు, సీఆర్‌టీలు

అర్వపల్లి : అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం 2014కు చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పదేళ్ల తర్వాత కలుసుకోవడంతో విద్యార్థినులు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువుచెప్పిన టీచర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో అర్వపల్లి, మద్దిరాల ఎస్ఓలు నాగమణి, తేజశ్రీ, సీఆర్‌టీలు విజయశ్రీ, రాధిక, సంధ్య, స్వాతి, లలిత, సునీత, నాన్‌టీచింగ్ సిబ్బంది యల్లమ్మ, ఉమ, సులోచన, విద్యార్థినిలు రేణుక, రాధిక, కవిత, రేవతి, సోని, దివ్య, కల్పన, పుష్పలత పాల్గొన్నారు.

2024 యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


అర్వపల్లిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

అర్వపల్లి : స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట అర్వపల్లి 2024 యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద సోమవారం రాత్రి మండల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలలో భాషబోయిన సుష్మ ప్రథమ బహుమతి, మనీషా ద్వితీయ బహుమతి, సీహెచ్. విజయలక్ష్మి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవాని దీక్ష మాలధారులు జిన్నె అశ్విన్, సాయి, అనిల్, శివ, నరేష్, ప్రదీప్, రాజేష్, రాజు, అజయ్, సిద్ధు, గణేష్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గామాత మంగళవారం మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చింది. భక్తులు మండపాల వద్ద పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


సూర్యాపేట టౌన్ : సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సూర్యాపేట టౌన్ : మహాలక్ష్మీ దేవిగా సంతోషిమాత..


మద్దిరాల : కుక్కడంలో కుంకుమ పూజ..


మద్దిరాల : పూజలో పాల్గొన్న భక్తులు


నాగారం : వర్ధమానుకోటలో పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిషోర్, తదితరులు


తిరుమలగిరిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నూతన భవనాల ప్రారంభమెప్పుడో..

- ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పంచాయతీ భవనాల నిర్మాణం
- బిల్లుల విడుదలలో జాప్యంతో కొన్ని గ్రామాల్లో నిలిచిన పనులు


చినసీతారాంతండా గ్రామ పంచాయతీ భవనం

పెన్‌పహాడ్ : మండలంలో నూతనంగా నిర్మించిన పలు గ్రామ పంచాయతీల భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేయడంతో మండలంలోని న్యూబంజారాహిల్స్ తండా, చిన సీతారాంతండా, గాజుల మల్కాపురం, తంగెళ్లగూడెం, లింగాల గ్రామాల్లో భవనాల నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే అవి ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఒక్కో భవనాన్ని రూ. 20లక్షలతో నిర్మించారు. దోసపహాడ్, రంగయ్యగూడెం గ్రామాల్లోని భవనాల పనులు శ్లాబ్ దశలో ఉన్నాయి.

బిల్లులు రాక నిర్మాణాల్లో ఆలస్యం..

మండలంలోని మేగ్యాతండా, చినగారకుంట తండాల్లో నూతనంగా పంచాయతీ భవనాల నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసిన వాటికి బిల్లులు అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మిగిలిన భవనాల పనులను ప్రారంభించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

చేసిన పనులకు బిల్లులు రాలేదు

గత ఏడాది తమ గ్రామానికి కొత్తగా పంచాయతీ భవనం మంజూరైంది. దీంతో సొంత నిధులతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాం. ఇప్పటి వరకు ఒక్క రూపాయి బిల్లు చేయలేదు.

– లక్ష్మణ్, మాజీ సర్పంచ్ చినసీతారాంతండా